పూత వికసించి.. ఆశలు చిగురించి..

- జీడి మామిడి తోటల్లో ఆశాజనకంగా పూత
- దిగుబడిపై కోటి ఆశలు పెట్టుకున్న రైతులు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న అధికారులు
- తొమ్మిది వేల హెక్టార్లలో జీడి మామిడి సాగు


తేటగుంటలో రైతుతో కలసి జీడి పూతను పరిశీలిస్తున్న హెచ్ఓ విజయలక్ష్మి

తుని రూరల్: వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో నియోజకవర్గంలో జీడి మామిడి తోటల్లో పూత ఆశాజనంగా ఉంది. దీంతో రైతుల్లో దిగుబడిపై ఆశలు చిగురించాయి. ఈ సంవత్సరం సకాలంలో పూత, పిందెలు విచ్చుకున్నట్టు ఉద్యాన అధికారులు తెలిపారు. ఆశించిన స్థాయిలో పూత ఉండి పిందెలు సైతం కనిపిస్తున్నాయి. కాగా తేనె మంచు కారణంగా తెగుళ్ల సోకడంతో పెట్టుబడుల భారం అధికమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు ఇలా..

ఉద్యానశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని కోటనదూరు, తొండంగి, తుని, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో తొమ్మిది వేల హెక్టార్లలో జీడి మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు 60 శాతం పూత కనిపిస్తోందని, 30 శాతం పిందెలపై ఉండగా పది శాతం తోటల్లో పూత, పిందెలు కానరాలేదని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు. సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే పూత, పిందెలు పుష్కలంగా వచ్చి మంచి దిగుబడులు వస్తాయన్నారు. జీడి మామిడిలో ఆశించే పురుగులు, తెగుళ్లు, నివారణ పద్ధతులపై ఆమె పలు సూచనలు చేశారు.

కాండం, వేరు తొలుచు పురుగు

లద్దె పురుగు బెరడుపై రంధ్రాలు చేసి తొలుచుకుంటూ కాండం, వేరు లోపలికి చేరుతుంది. ఈ లద్దెపురుగుల పరిమాణం పెరిగే కొలది సొరంగాల పరిమాణం కూడా పెరుగుతుంది. ఈ పురుగు తిని విసర్జించిన వ్యర్థాలు చెక్కపొడి రూపంలోనూ, నల్లని బంక రూపంలో ఉండి సొరంగాలను నింపేస్తుంది. దీనివలన క్రమంగా ఆకులు పండుబారి రాలిపోతాయి. కొమ్మలు ఎండిపోతాయి. చివరికి చనిపోతాయి.

నివారణ ఇలా..

ఏడు సంవత్సరాలు, ఆపై వయస్సు గల చెట్ల కాండం ఆరు అడుగుల ఎత్తు వరకూ, భూమిపైన కనబడే వేర్లను సన్నని ఇనుపవైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్ది ఆ తర్వాత బాగా తడిచేలా ఐదుశాతం వేపనూనె ద్రావణాన్ని నాలుగు నెలలకు ఒకసారి పిచికారీ చేయాలి. పురుగు ఆశించిన చెట్ల నుంచి బంక కారుతూ ఉంటుంది. వెంటనే బెరడు కింద దాగి ఉన్న లద్దెపురుగులను తొలగించాలి. ఆకులు పూర్తిగా పసుపు రంగుకు మారగాగనే చెట్లను వెంటనే వేర్లతో సహా తిసి వేసి వేర్లలో దాగి ఉన్న ప్యూపాను నాశనం చేయాలి.

తేయాకు దోమ (టీదోమ)

తేయాకు దోమ ప్రభావంతో 30 నుంచి 40 శాతం దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకూ జీడిమామిడిలో తేయాకు దోమ కనిపిస్తుంది. దోమ ఆశించిన చెట్లలో లేత ఆకులు, పూత మాడిపోయి పక్వానికిరాని జీడి గింజలు నేలరాలిపోతాయి. తయారైన గింజలపై మచ్చలు ఏర్పడి ఫలసాయం నాణ్యత కోల్పోతుంది. ఉధృతి ఎక్కువగా ఉండే చెట్లు కాలిపోయినట్టు కనిపిస్తాయి. ఈ దోమ పిల్ల దశ, తల్లి దశల్లో లేత కొమ్మలను, పూత రెమ్మలను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురు కారుతూ పూత, పిందెలకు నష్టం కలిగిస్తుంది.

నివారణ ఇలా..

మూడు దశల్లో సస్యరక్షణ మందులు పిచికారీ చేయాలి. మొదటగా కొత్త చిగురు వచ్చే సమయంలో మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండోసారి పూత బయటకువచ్చే సమయంలో లామ్డాసైహాలో 0.6 మిల్లీ లీటర్ల లేదా క్లోరిపైరిఫాస్ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి కొమ్మలు బాగా తడిచేవిధంగా పిచికారీ చేసుకోవాలి. మూడోసారి జీడి గింజ బఠాణి పరిమాణంలో ఉన్నప్పుడు ప్రొఫెనోఫాస్ ఒక మిల్లీ లీటర్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

యాజమాన్యమే కీలకం



జీడితోటల్లో యాజమాన్యమే కీలకం. తెగుళ్ల, పురుగుల నివారణకు పూత, పిందెలు, గింజ సేకరణ తర్వాత సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పక్వానికి వచ్చిన పండ్ల నుంచే గింజలను సేకరించి, తడి ఆరబెట్టాలి. సరైన గిట్టుబాటు ధర లభించినప్పుడు విక్రయించుకోవాలి. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఉద్యాన సహాయకుల సలహాలు, సూచనలు పాటించాలి. – జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

తామర పురుగు

ఈ పురుగులు పుష్పగుచ్చాలను, ఎదుగుతున్న కాయలను, పండ్లను గోకి రసం పీల్చడం వలన గరకు మచ్చలు ఏర్పడి దిగుబడి, నాణ్యత తగ్గిపోతుంది.

నివారణ

డైమిథోమేట్ రెండు మిల్లీ లీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

లెట్ తెగులు

ఈ తెగులు వలన పుష్పగుచ్చాలు, ఎదుగుతున్న గింజలు మెత్తబడి పూర్తిగా ఎదగకుండానే ఎండిపోయి రాలిపోతాయి.

నివారణ

అవసరాన్ని బట్టి లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండిజిమ్ కలిపి పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

ఎమ్మెల్యే చంటిబాబును కలిసిన ఐసీడీఎస్ సీడీపీఓ


ఇర్రిపాకలో ఎమ్మెల్యే చంటిబాబును కలిసిన సీడీపీఓ పూర్ణిమ

జగ్గంపేట: జగ్గంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా నియమితులైన ఎం.పూర్ణిమ గురువారం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆమె పదోన్నతిపై జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వచ్చారు. జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఎక్స్‌రే మెషీన్ ఏర్పాటు చేయాలని వినతి


జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాకు వినతిపత్రం అందజేస్తున్న జైభీమ్ భారత్ పార్టీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌రే మెషీన్ ఏర్పాటు చేయాలని జైభీమ్ భారత్ పార్టీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు ఆధ్వర్యంలో గురువారం కాకినాడలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ ఏజెన్సీ ముఖద్వారంతో పాటు, మండల కేంద్రమైన ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌రే మెషీన్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఎక్స్‌రే మెషీన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుంగా సతీష్ కుమార్, గాది గౌతమ్, తుర్లపాటి బాబులు, గుడాల కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కిర్లంపూడి: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

కిర్లంపూడి: మండలంలోని పలు అంగన్‌వాడీ సెంటర్లను గురువారం బీజేపీ నాయకులు పరిశీలించారు. మండలంలోని సోమవరంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు బాలింతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా? లేదా ? అని ఆరా తీశారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో దాకే కృష్ణారావు, కురసాల రాజా తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానిక చైతన్య నగర్‌కు చెందిన ఎస్.వీరబాబు తాటాకిల్లు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఇంటో ఎవరూ లేని సమయంలో ప్రమాదం జరగడంతో ప్రాణ నష్టం జరగలేదు. ప్రత్తిపాడు అగ్ని మాపక అగ్ని సిబ్బంది మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ బహూకరణ

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2003–2004 పదో తరగతి విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు కూలింగ్ వాటర్ ఫిల్టర్‌ను గురువారం బహూకరించారు. ప్రస్తుత వేసవిలో పాఠశాల విద్యార్థులకు చల్లని తాగునీరు అందించాలన్న లక్ష్యంతో వాటర్ ఫిల్టర్ బహూకరించినట్లు తెలిపారు.

కాకినాడ-తునికి కొత్తగా అల్ట్రా పల్లెవెలుగు సర్వీసు

కాకినాడ: కాకినాడ–తుని మధ్య కొత్తగా రెండు అల్ట్రా పల్లెవెలుగు బస్సులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్సులను శుక్రవారం ఆయన కాకినాడ ఆర్టీసీ బస్సు డిపోలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక ఆల్ట్రా పల్లె వెలుగు బస్సులను ప్రవేశపెట్టామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ డి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకరావు తదితరులు పాల్గొన్నారు.

కూలిన కాజ్‌వేను పరిశీలించిన ఆర్డీఓ


ఏలేశ్వరంలో కాజ్‌వే పరిశీలనకు వస్తున్న ఆర్డీఓ సీతారామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణ పరిధిలో ఏలేరు కాలువపై కూలిపోయిన కాజ్‌వేను (వంతెన) గురువారం పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు పరిశీలించారు. కాజ్‌వే కూలిన సంఘటనపై స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి ఇంజినీరింగ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నేత అలమండ చలమయ్య కాజ్‌వే కూలిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని ఆర్డీఓకు తెలిపారు. కాజ్‌వే నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ చింతకాయల చినబాబు గురువారం తెలిపారు. విజయవాడ డాక్టర్ వైవీ రావు ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో రోగులకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి టూడీ, ఎకో, గుండె స్కానింగ్‌లు ఉచితంగా చేస్తారన్నారు. మండల ప్రజలు ఈ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జోరుగా పింఛన్ల పంపిణీ


భద్రవరంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్, వలంటీర్


మర్రిపాకలో లబ్ధిదారుడు సత్యనారాయణకు పింఛను సొమ్ము అందజేస్తున్న వలంటీర్, ఎంపీటీసీ

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ రెండోరోజు శుక్రవారం జోరుగా సాగింది. ఉదయం నుంచి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, గ్రామ వలంటీర్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని భద్రవరంలో సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పార్టీ నాయకులు చీమల వెంకన్నబాబు, కూనపురెడ్డి దుర్గారావు, ఉగ్గినరాజు పాల్గొన్నారు. ఏలేశ్వరం పట్టణంలోని లబ్ధిదారులకు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారు. ప్రస్తుతం గ్రామ వలంటీర్లు ఇంటికే తెచ్చి పింఛన్లు అందజేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డయాలిసిస్ రోగికి రూ.10 వేలు పింఛను అందజేత

జగ్గంపేట: మండలంలోని మర్రిపాక గ్రామానికి చెందిన కాపవరపు సత్యనారాయణ డయాలిసిస్‌తో బాధపడుతున్నాడు. అతనికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల పింఛన్‌ను గురువారం వలంటీర్ వాసిరెడ్డి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పైలా శివరామకృష్ణ అందజేశారు. తనకు పింఛను మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

లింగవివక్ష నిర్మూలనపై అవగాహన ర్యాలీ

తొండంగి: లింగ వివక్షను నిర్మూలించాలంటూ మండలంలోని పెరుమాళ్లపురంలో గురువారం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు, వైద్యారోగ్య సిబ్బంది కలిసి పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ప్రజలకు లింగ వివక్షపై అవగాహన కల్పించారు. భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెహర్, అధ్యాపకులు వివాకర్, టి.రాము, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జీయ్యన్న తిరునాళ్లకు భారీ బందోబస్తు


తాళ్లూరులో బందోబస్తుపై సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్సై గణేష్‌కుమార్

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు (జీయ్యన్న మఠం)లో వేంచేసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రారంభమయ్యే తిరునాళ్లకు భారీ బందో బస్తు ఏర్పాటు చేసినట్టు స్థానిక ఎస్సై వై. గణేష్ కుమార్ గురువారం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో జాతీయ రహదారికి సమీపంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించామన్నారు. ఆలయ కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు రక్షణార్థం గజ ఈతగాళ్లను సిద్ధం చేశామన్నారు. జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో 60 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వివరించారు. కాగా స్వామివారి కల్యాణోత్సవాలకు పంచాయతీ పాలకవర్గం సక్రమంగా ఏర్పాట్లు చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా పరదేశమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


పరదేశమ్మతల్లికి సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు కొత్త సూరవరంలో కొలువైన పరదేశమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పరదేశమ్మ బాలభక్త వినాయక సంఘం ఆధ్వర్యంలో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు. గ్రామ యువకుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. కొత్త సూరవరం, ఎస్.అన్నవరం, కవలపాడు, పెద రామభద్రపురం, తుని తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి, అన్న ప్రసాదం స్వీకరించారు. పఎరదేశమ్మ బాలభక్త వినాయక సంఘం అధ్యక్షుడు వేముల శివ నారాయణ, కార్యదర్శి పైలా రాజు, కోశాధికారి చవితిన సన్యాసిరావు, మాజీ అధ్యక్షుడు గంటా చక్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్యాస్ ధరల పెంపుపై ఆందోళన


ఏలేశ్వరం ఆందోళన చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌ధరలు పెంచడంపై పట్టణంలో గురువారం మహిళలు ఆందోళన చేశారు. సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌లతో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌ధరలు పెంచి సామాన్యులపై పెను భారం మోపిందన్నారు. గ్యాస్‌ధరలు పెంచడంతో పేదలకు ఆర్థిక ఇబ్బందులు తప్పవన్నారు. సామాన్యుల నడ్డి విరిచి కార్పొరేట్‌లకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, పిల్లాకాంతం, సుబ్బలక్ష్మి, వరాలమ్మ, సంకురమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన

ప్రత్తిపాడు: కేంద్రం వంట గ్యాస్ ధరను పెంచడంపై పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి వంట గ్యాస్ ధర పెరుగుతూనే వచ్చిందన్నారు. నిత్యావసర వస్తువులతో పాటు వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, కందిమళ్ల సామ్యేలు, అంకా సాహెబ్, జి. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐప్వా జిల్లా అధ్యక్షురాలు అప్పలరాజు

ప్రత్తిపాడు: ఏలేశ్వరంలో ఈ నెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం (ఐప్వా) జిల్లా అధ్యక్షురాలు సేలం అప్పలరాజు కోరారు. ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఐప్వా కాకినాడ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో డాక్టర్ ప్రీతి సంఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. మహిళలపై వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సంఘ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాకర రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి వల్లూరి నాగమణి, మండల కార్యదర్శి రాజాల రత్నం, మానుకొండ లోవమ్మ, పల్లా సరస్వతి, మాది వెంకయ్యమ్మ, గుడాల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

416 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

గోకవరం: క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను 30 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులు విధిగా చేయించుకోవాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రభ సూచించారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో గురువారం రాజమహేంద్రవరం మెడికల్ కళాశాల యాజమాన్యం సహకారంతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. మండలంలోని సుమారు 416 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 49 మందిని క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వనజా కుమారి, కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి డాక్టర్ రవిచంద్ర, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సీహెచ్ఓ మేరీకృప, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆర్జేడీ తనిఖీలు


వీరలంకపల్లిలో విద్యార్థులను బైజూస్ ట్యాబ్ వినియోగంపై ఆరా తీస్తున్న ఆర్జేడీ నాగమణి

గోకవరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వీరలంకపల్లిలోని వెలుగు బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశం నిర్వహించి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారికి తల్లిదండ్రులు దగ్గర లేని లోటు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కామరాజుపేట జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరుశాతం తక్కువ ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట రాజమహేంద్రవరం డీవైఈఓ ఎం.తిరుమలదాసు, కొయ్యలగూడెం డీవైఈఓ ఎం.రామన్నదొర, గోకవరం ఎంఈఓ బి.గౌరమ్మ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: పట్టణ పరిధిలోని 33/11 కేవీ తాండవ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ పరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. పట్టణంలోని కొండవారిపేట, టైలర్స్ కాలనీ, అమ్మాజీపేట, సీతారాంపురం, కంకిపాటి వారి గరువు, శ్రీనివాస్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రెల్లికాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

తొండంగి: మండలంలోని అన్నవ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆనూరు, పైడికొండ, వేమవరం, అద్దరిపేట, యర్రయ్యపేట, ముసలయ్యపేట, కొత్తపేట, అన్నవ్యపేట తదితర గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జగ్గంపేట: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక ట్రాన్స్‌కో డీఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని నరేంద్రపట్నం, గొల్లలగుంట, కాండ్రేగుల, భావవరం, గుర్రంపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట డివిజనల్ ఇంజనీర్ రత్నాలరావు తెలిపారు. ప్రత్తిపాడు నుంచి కిర్లంపూడి మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కోటనందూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్లో వార్షిక మరమ్మత్తుల కారణంగా శుక్రవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంటు ఉండదని ట్రాన్స్ డీఈ రత్నాలరావు తెలిపారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత


ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శంఖవరం: ఆడపిల్లల సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ పర్వత రాజబాబు సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో గురువారం వైద్యాధికారి డాక్టర్ ఆర్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన ‘బేటీ బచావో– బేటీ పడావో’ కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ బందిలి గన్నియ్యమ్మ, డాక్టర్ రాజ్‌కుమార్, ఎస్ఓ బాలమణికుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యావంతులు కావాలి

తుని రూరల్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాలికలు ఉన్నత విద్యావంతులు కావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ అన్నారు. తుని మండలం వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భేటి బచావో భేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతల రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో బాలికల విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకుఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, దుస్తులు, షూలు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకుని మధ్యలో చదువు ఆపేయకుండా ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. విద్యార్థినులు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ అన్వేషి సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అమృతవాణి, ఎంపీటీసీ సభ్యుడు కిల్లి సన్యాసిరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దుంగల నాగేశ్వరరావు, సూరెడ్డి లోవరాజు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ ఆడపిల్లలను చదివించాలని మండల వైద్య ఆరోగ్య విస్తరణాధికారి కె.భాస్కర్‌రావు సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం బేటీబచావో బేటీపడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల చిన్నచూపు చూడరాదన్నారు. లింగనిష్పత్తి ప్రకారం ఆడపిల్లలు ఉండాలన్నారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మాణిక్యకుమారి, హెల్త్‌సూపర్‌వైజర్ ఎస్వీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రికి బెడ్ షీట్స్ అందజేత


తుని ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు సమకూర్చిన బెడ్ షీట్స్‌తో వైద్యులు

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి దాతలు బెడ్ సీట్స్‌ను అందించినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వప్న గురువారం తెలిపారు. తుని పట్టణానికి చెందిన రామకృష్ణా సేవాసమితి 200, దర్బా శ్రీనివాస్ 100 బెడ్ సీట్స్‌ను అందజేసినట్టు చెప్పారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా స్ఫూర్తితో దాతలు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్లు మహేష్, నరేష్‌కుమార్, శశికళ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.